సర్కార్ ఆసుపత్రిలో దోమల బెడద

- పట్టపగలే కుడుతున్నాయంటూ రోగుల గగ్గోలు
- జబ్బుకన్నా దోమల బాధతో విలవిల

ఆకివీడు: 'ప్రజలు దోమల నివారణపై అప్రమత్తంగా ఉండాలి. నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.' అంటూ వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పేరిట అవగాహన కలిస్తూ ఉంటారు. అయితే వైద్య సిబ్బందికి ప్రధాన కార్యాలయం ప్రభుత్వాస్పత్రిలో అపరిశుభ్రత రాజ్యం ఏలుతుంది. ఆకివీడు సీహెచ్‌సీ ఆసుపత్రి చుట్టూ పచ్చికబైళ్లను తలపిస్తూ పిచ్చిమొక్కలు, పచ్చగడ్డి, మరొక పక్క మురుగు కూపాలు, ఇంకొక పక్క నీటి నిల్వలు, ఆ వైపున నగర పంచాయతీ డంపింగ్‌యార్డుకు సంబంధించిన వ్యర్థాలతో నిండి ఉంది. నాలుగు దిక్కులూ అపారిశుద్ధ్యానికి నిలయంగా ఉండటంతో సర్కారు ఆసుపత్రిలో దోమలు విజృంభిస్తున్నాయి. రేయింబవళ్లు రోగులు, సిబ్బంది రక్తం పీల్చి పిప్పిచేస్తున్నాయి. దోమల బెడదతో టైఫాయిడ్, మలేరియా, చికున్ గున్యా, డెంగీ వంటి వ్యాధులతో ప్రజలు వైరల్ ఫీవర్లు, విష జ్వరాలతో హడలిపోతున్నారు. ఆయా వ్యాధులకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకుందామంటే అక్కడ మరొక నరకం కన్పిస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

బెంబేలెత్తుతున్న సహాయకులు

రోగులతో పాటు వచ్చిన వారి సహాయకులు కూడా దోమల బెడదతో బెంబేలెత్తిపోతున్నారు. నీటి నిల్వలు ఉంచకూడదని ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మలేరియా సబ్‌డివిజన్ జిల్లా అధికారులు పలు గ్రామాల్లో తిరిగి ప్రచారాలు చేస్తున్నారు. అయితే ఆసుపత్రి ఆవరణలోనే నీటినిల్వలు, మురుగునీటి నిల్వలతో నిండి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. బ్లీచింగ్, సున్నం వంటివి కొట్టించడం, ఆసుపత్రి ఆవరణలో పిచ్చ మొక్కలు, పచ్చగడ్డి తొలగించడం, నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆసుపత్రి ప్రాంగణంలోని చెట్లపై పక్షులు ఆవాసం చేయడంతో వాటి నుండి వచ్చే రెట్టల వల్ల కూడా రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల వరదల్లో ఆసుపత్రి ప్రాంగణం ముంపునకు గురైంది. ఆసుపత్రి ప్రాంగణంలో నుంచి వెళ్తున్న పంట కాల్వలోకి కూడా చెత్త, ఇతర వ్యర్థాలు చొచ్చుకువెళ్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేయించాలని రోగులు వేడుకుంటున్నారు.



సీహెచ్‌సీ ప్రాంగణంలో మురుగునీరు



104 వాహనం టైరులో నిల్వ ఉన్న నీరు



సీహెచ్‌సీ ప్రాంగణంలో దోమలకు నిలయంగా ఉన్న మురికి కూపం, పచ్చిక బైళ్లు

క్లుప్తంగా

కార్తీక వన సమారాధన



హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహిస్తున్న కార్తీక వన సమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): కార్తీక మాసం సందర్భంగా భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అల్లం నాగ రమేష్, ధనలక్ష్మి సత్యవాణి దంపతులచే ఆలయ అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా 108 మంది మహిళలచే విష్ణు సహస్రనామ పారాయణ, గోవింద నామాలు, హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. అనంతరం కార్తీక దామోదర పూజ నిర్వహించి కార్తీక సమారాధన ప్రారంభించారు. సుమారు 3 వేల మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

ముగిసిన పాండురంగ స్వామి కల్యాణ మహోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు, నాయకులు

కాళ్ల: స్థానిక శ్రీ రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణ మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో శాశ్వత ధర్మకర్త మండలపర్తి శ్రీచంద్రశేఖర్, కమిటీ సభ్యులు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బండారు నాయుడు, నారిన తాతయ్య, బండారు వేణు గోపాలరావు, గోళ్లనాగేశ్వరరావు, బండారు సోమేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



బహుమతులు అందిస్తున్న తహసీల్దార్

కాళ్ల: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం మండలంలో కాళ్ల, దొడ్డనపూడి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. దొడ్డనపూడి, కాళ్ల గ్రామాల్లో తహసీల్దార్ సుందర్ సింగ్, సూపర్ వైజర్ వి.నిర్మల వివిధ అంశాలపై అవగాహన కలిప్పించారు. కార్యక్రమంలో జీవించే హక్కు, రక్షణహక్కు, అభివృద్ధి హక్కు, భాగస్వామ్య హక్కులు భారత ప్రభుత్వం బాలలకోసం చేపట్టిన విషయాలను వివరించారు.

మొక్కల పెంపకం అధ్వానం

నరసాపురం: మునిసిపాలిటీలో మొక్కల పెంపకం కార్యక్రమం అధ్వానంగా మారింది. చిత్తశుద్ధి లేకుండా తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించడంలో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మొత్తంగా లక్షలు ఖర్చుపెట్టి చేపట్టిన మొక్కల పెంపకం లక్ష్యం లేకుండా పోయింది. నాలుగేళ్లుగా మొక్కల పెంపకం కార్యక్రమాన్ని మున్సిపాలిటీలో అట్టహాసంగా నిర్వహించారు. పలు దఫాలుగా పట్టణంలో మొక్కలు నాటారు. అయితే వాటి సంరక్షణను మాత్రం గాలికి వదిలేశారు. దీంతో పట్టణంలో గోదావరిగట్టు, వైఎన్ కళాశాలరోడ్డు, ఎన్టీఆర్‌కాలనీ, నందమూరి కాలనీ, బస్టాండ్ ప్రాంతం, రైల్వేస్టేషన్ రోడ్డు, మిషన్ హైస్కూల్ రోడ్డు ప్రాంతాల్లో నాటిన మొక్కలు కనిపించడం లేదు. దూడలు తినేయడం, నీళ్లు వేయడం లాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు చచ్చిపోయాయి. సాక్షాత్తు మునిసిపల్ కార్యాలయం ఆవరణలోనే మొక్కలకు నీళ్లుపోసేవారు లేక ఎండిపోతున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో? అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొక్కల సంరక్షణపై దృష్టి పెట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఓట్లు మావి.. పదవులు మీకా?

పెనుగొండ: బహుజన కులాల ఓట్లతో గద్దెనెక్కి అధికారం వచ్చిన అనంతరం ఒకే కులానికి ప్రధానమైన పదవులు, మొక్కుబడిగా బహుజన కులాలకు అప్రాధాన్య పదవులు ఇవ్వడం న్యాయమా? అని బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్డీఏ కూటమిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సామాజిక న్యాయమంటూ అధికారంలోకి వచ్చి ఇపుడు ఒకే కులానికి పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు రబ్బరు చెప్పులు వేసుకున్నవారితో రాజకీయాలు చేయిస్తానంటూ ఆర్భాటంగా ప్రకటించి, కార్పొరేట్ భావజాలంతో బలహీన వర్గాలపై ఆరెస్సెస్ ఎజెండా అమలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా బహుజన కులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చెన్నమల్లేశ్వరుని సేవలో సీఐ దంపతులు



స్వామిని దర్శించుకుంటున్న సీఐ దంపతులు

ఉండి: స్థానిక రాజులపేటలో ఉన్న పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామిని ఆకివీడు సర్కిల్ ఇన్స్పెక్టర్ జగదీశ్వరరావు దంపతులు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసారు. సీఐ దంపతులకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేసారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సన్నిధిరాజు కృష్ణ, సన్నిధిరాజు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి



కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులు, రైస్ మిలర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రైతులు ఎంపిక చేసుకున్న మిల్లుకు ధాన్యాన్ని పంపే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 23 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా రూ.54 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు చెప్పారు. ధాన్యంతో మిల్లు వద్దకు వచ్చిన వాహనాలను తక్కువ సమయంలో దిగుమతి చేసి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బహిరంగ మార్కెట్లో ధాన్యం విక్రయించే రైతులకు కూడా కచ్చితంగా ప్రభుత్వ మద్దతు ధర అందేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఏదైనా సమస్య ఎదురైతే కంట్రోల్ రూమ్ 81216 76653 నంబర్ నందు సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో భీమవరం ఆర్డీవో కె ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ టి శివరామప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీఎస్‌వో ఎన్ సరోజ, ఏఎస్‌వో ఎం.రవి శంకర్, సహాయక మేనేజరు పీడీఎస్ సత్యనారాయణ, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు, కార్యదర్శి కొత్త శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల ద్వారా రైతులకు మరిన్ని సేవలు

భీమవరం: రైతులకు అవసరమైన రుణాలు ఇవ్వడంలో సహకార బ్యాంకు ముందంజలో నిలుస్తుందని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఏజీఎం శంకర్ నారాయణ అన్నారు. సహకార సంఘాల వారోత్సవాల్లో భాగంగా శనివారం భీమవరం సహకార కేంద్రబ్యాంక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల సేవలను మరితం బలోపేత చేసి రైతులకు మరిన్ని సేవలు అందిస్తామన్నారు. డీసీసీబీ మేనేజర్ డి వెంకటరెడ్డి నాయుడు మాట్లాడుతూ గతంలో రైతులకు సహకార బ్యాంకుల ద్వారా కేవలం పంట రుణాలు మాత్రమే అందించగా, నేడు ఇంటి రుణాలు, విద్యా రుణాలు, బంగారు నగల తాకట్టుపై తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, బ్యాంక్ సిబ్బంది వి సురేష్, ఏం జానకిరామ్‌తేజ, సీహెచ్ గోపీకృష్ణ, పెండ్యాల సరిత శైలజ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చినకాపవరంలో అఖండ అన్నసమారాధన

ఆకివీడు: కార్తీక మాసంలో పరమేశ్వరుడికి భక్తి శ్రద్ధలతో చేసే పూజల వల్ల ముక్తి, విముక్తి కలుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకురాలు, పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నందమూరి సత్యవతి అన్నారు. మండలంలోని చినకాపవరం గ్రామంలో ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి విశిష్ట పూజలు నిర్వహించారు. స్వామికి మహిళలు అధిక సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన కార్యక్రమాన్ని సత్యవతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎర్రంశెట్టి బాలాజీ, గాజుల వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర ప్రసాద్, గంగాధర్‌రావు, కమిటీ సభ్యులు, అర్చకులు సామవేదం సుధాకర శాస్త్రి పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఎన్నికల హామీలను అమలు చేయాలి

భీమవరం: కూటమి పార్టీలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం నేతలు డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్, ఆదర్శ నగర్, నెహ్రూ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఇళ్లు లేని పేదలకు తక్షణం స్థలాలిచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. పట్టణం ప్రాంతంలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏలేటి ఆనంద్, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, సావిత్రి, వెంకాయమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



భీమవరం ఆదర్శనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

ఉండి: గ్రంథాలయాల ఏర్పాటులో ఎంతో మంది మహనీయులు తమ జీవితాలను త్యాగం చేశారని ఉండి గ్రంథాలయ అధికారి జేవీ కృష్ణమూర్తి అన్నారు. శనివారం ఉండి శాఖ గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రముఖులకు నివాళులర్పించారు. గ్రంథాలయాల ఏర్పాటు కోసం పోరాడిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రంథాలయ స్థాపనకు ఎంతో మంది పోరాటాలు చేసారన్నారు.వారి త్యాగఫలాలే ఈ రోజు గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా మారాయన్నారు. గ్రంథాలయాలను ఎవ్వరూ చిన్న చూపు చూడొద్దని వాటిని వినియోగించుకున్న ప్రతీ ఒక్కరూ గొప్పవారయ్యారని అన్నారు.

విద్యార్థులకు చెస్ పోటీలు

పాలకోడేరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం పాలకోడేరు మండలం గొల్లలకోడేరు శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు చెస్ పోటీలు గ్రంథాలయ అధికారి జి.బాలరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ ఎస్ నెం-1 స్కూల్ హెచ్ఎం జి.నెహ్రూ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థీ తమ మేధస్సుకు పదును పెట్టుకోవాలని, గ్రంథాలయం ఆధ్వర్యంలో ఇలాంటి చెస్ పోటీలు పెట్టడం వల్ల విద్యార్థుల మెదడు చురుకుగా పనిచేస్తుందన్నారు.

భీమవరంలో..

భీమవరం: పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవచ్చునని రిటైర్డ్ జిల్లా విద్యా శాఖాధికారి ఇందుకూరి ప్రసాదరాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం భీమవరం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రంథాలయాలు విజ్ఞాన గనులని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. తొలుత గ్రంథాలయ అభివృద్ధికి కృషిచేసిన డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు, ఎస్ సత్యనారాయణరాజు, ఎ నర్సింహరాజు, కేవీ సుబ్బరాజు, రామనాగేశ్వరరావు, జి.నాగరాజు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉండి: గ్రంథాలయ ఏర్పాటు కోసం పోరాడిన నాయకులకు నివాళులర్పిస్తున్న దృశ్యం



పాలకోడేరు: గొల్లలకోడేరులో చెస్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా కార్తీక దీపోత్సవం



ప్రత్యేకాలంకరణలో కాళ్లకూరు వెంకన్న



ఆకట్టుకున్న కార్తీక దీపాలంకరణ

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో దీప ప్రతిమల వెలుగుల్లో శ్రీవారి ఆలయం దేదీప్యమానంగా వెలిగింది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తి చేసిన అనంతరం ఈ దీపోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు హాజరై దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ మోకా అరుణ్ కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం కోర్టు భవనాల సముదాయం ఆవరణలో డిసెంబర్ 14న 2వ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా పేర్కొన్నారు. శనివారం కోర్టు భవనంలో వద్ద కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సికిందర్ బాషా మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులు రాజీ చేయాలని తెలిపారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఎస్.కిరణ్‌శ్రీ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.అన్నామణి పాల్గొన్నారు.

సూర్యరశ్మితో చవకగా విద్యుత్ ఉత్పత్తి

తాడేపల్లిగూడెం రూరల్: సోలార్ ప్యానల్స్ ద్వారా సూర్యరశ్మిని, గాలిని వినియోగించుకుని సహజ సిద్ధంగా చవకగా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రఘునాథ బాబు అన్నారు. శనివారం చినతాడేపల్లిలో సూర్యఘర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈ రఘునాథబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8,500 సోలార్ ప్యానల్స్‌ను అందించేందుకు పేర్లు రిజిస్టర్ చేశామన్నారు. త్వరలోనే ప్రభుత్వ, వ్యవసాయ అవసరాలకు సోలార్ ప్యానల్స్‌ను అమర్చుతామన్నారు. ప్రభుత్వం 200 యూనిట్లు సబ్సిడీ ఇస్తుందని, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చన్నారు.

దళితుల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వాలు కృషి చేయాలి

ఆకివీడు: దళిత పేటలు అభివృద్ధి చెంది, దళితులు ఆర్థిక స్వావలంబన దిశగా అభివృద్ధి సాధించినప్పుడే దేశ ప్రగతి కన్పిస్తుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ చెప్పారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత పేటల అభివృద్ధికి వినియోగించాల్సిన నిధులను ఆయా ప్రాంతాల్లోనే అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. దళిత వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించినప్పుడే అంబేడ్కర్ ఆశయం నెరవేరుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ప్రజా ప్రతినిధులంతా బయటకు రావాలని, ఉద్యమ భాగస్వాములు కావాలని పుష్పరాజ్ పిలుపునిచ్చారు. దళితవాడల్లో కనీస సౌకర్యాల కోసం అసెంబ్లీలో గళం విప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీల్లో రోడ్లు, మంచినీరు, డ్రెయినేజీ సౌకర్యం, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. తొలుత సంఘ మండల యువజన కమిటీ అధ్యక్షులుగా కాయల మనోజ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా ప్రధానకార్యదర్శి చిల్లె రాజ్ కుమార్, చిగురుపాటి రాజేష్, పిట్టా వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నన్నేటి పుష్పరాజ్

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

భీమవరం: జాతీయ పత్రికా దినోత్సవాన్ని శనివారం భీమవరంలో ఏపీయూడబ్ల్యూజే, భీమవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే, భీమవరం ప్రెస్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

భీమవరం: భర్త వేధింపులపై ఓ మహిళ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నెహ్రూకాలనీకి చెందిన పెచ్చెటి లీలామనోహర్‌తో పద్మలతకు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే భర్త తన బాగోగులు పట్టించుకోకుండా వేధిస్తున్నాడని, ఇందుకు మరో ఇద్దరు మద్దతు ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో వెబ్ సెమినార్

పాలకొల్లు సెంట్రల్: ఆన్‌లైన్ సెమినార్‌ల వల్ల మేథో సంపత్తి హక్కులపై అవగాహన కలుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థ శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో మేథో సంపత్తి హక్కులు అనే అంశంపై జాతీయస్థాయి వెబినార్ (ఆన్‌లైన్ సెమినార్) నిర్వహించారు. ఈ సందర్భంగా వెబ్ సెమినార్ రిసోర్స్ పర్సన్స్ సుస్మిత రాహుల్ బట్నాసే మాట్లాడుతూ మేథో సంపత్తి హక్కులు అనేవి స్టార్ట్ అప్, ఎంటర్‌పిన్యూర్‌షిప్ అభివృద్ధికి, అలాగే దేశాభివృద్ధికి తోడ్పడతాయని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు కె.భద్రాచలం, డాక్టర్ వి.విజయలక్ష్మి, ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): 108 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్, పైలెట్స్ రాజు, అనూష, చిరంజీవి, శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని ఎంఆర్ఓ, ఎండీఓలకు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ శనివారం స్థానిక కార్యాలయంలోని ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. తమకు జీఓఎంఎస్ నంబర్ 49ను పునరుద్ధరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగాల్లో ప్రాధాన్యతనివ్వాలని, 8 గంటల పనిదినం అమలు చేయాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 25 నుంచి సమ్మె చేపడతామని వారన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురంలో ఒక వ్యక్తిని బంధించినట్లు 112 నంబరుకు కాల్ రాగా, రూరల్ ఏఎస్సై గోపీనాథ్ తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. చౌదూరి మణికంత, మరో కొంతమంది కలిసి గోపీనాథ్ విధులు నిర్వహించకుండా అడ్డగించి దౌర్జన్యం చేశారు. దీనిపై ఏఎస్సై గోపీనాథ్ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై జేఎస్వీ.ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.